ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
బుధవారం 24 సెప్టెంబరు 2025



గద్దెల ప్రాంగణంలో గంటలు కొడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క



సమ్మక్క గద్దె వద్ద సీఎం రేవంత్ రెడ్డి మొక్కులు



సమ్మక్క గద్దె వద్ద సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంపీ తదితరులు

వనదేవతల దీవెనలతో దొరల పాలన అంతం

- ప్రజా ఆశయాలకు అనుగుణంగానే పరిపాలన
- మేడారంలో రామప్పను పోలిన రాతి కట్టడాల నిర్మాణం
- వందల ఏళ్లు గడిచినా చెక్కు చెదరొద్దనే సంకల్పం
- 100 రోజుల్లో పనులన్నీ పూరి చేస్తాం
- జాతరకు కేంద్రం జాతీయ హోదా ఇవ్వాలి
- మేడారం బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

ములుగు/తాడ్వాయి సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి అంటే అద్దాల మేడలు కాదని, ప్రజల జీవన ప్రమాణాలు అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రస్తుత ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని వనదేతల సన్నిధి మేడారంలో సీఎం మంగళవారం పర్యటించారు. ఇక్కడ చేపట్టిన మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఎల్‌ఈడీ స్ర్కీన్‌లపై మాస్టర్ ప్లాన్ డిజైన్ రూపకల్పన వీడియోను ప్రారంభించారు.

గద్దెల ప్రాంగణం పరిసరాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 2023 ఫిబ్రవరి 6న మేడారం సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద మొక్కులు అప్పగించానని తెలిపారు. దొరల పాలనను అంతమొందించి ప్రజా పాలన తీసుకొస్తామని వనదేతల సాక్షిగా సంకల్పించానని అన్నారు. దీంతో తల్లుల దీవెనలు తోడై ప్రజల ఆశీస్సులతో అధికారం చేపట్టామన్నారు. అభివృద్ధి అంటే అద్దాల మేడలు కాదని, రంగుల గోడలు అంతకన్నా కాదని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పని చేయాలని అప్పుడే సంకల్పించామన్నారు.

దేశ మూల వాసులైన ఆదివాసీలు, లంబాడీల ప్రాంతాలను అభివృద్ధిలో ముందుకు నడిపించాలని ప్రణాళికలు రూపొందించామన్నారు. తండాలు, గూడాలలో అభివృద్ధి చేపట్టామని, ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేశామని అన్నారు. మేడారం రావడానికి ముందు వాతావరణం అనుకూలంగా లేదని, వర్షసూచన ఉందని నిపుణులు చెప్పారు. కానీ, తనకు (మిగతా 7లో..)

రాతి కట్టడాలు

సిమెంట్‌తో కట్టిన నిర్మాణాలు 100 ఏళ్ల వరకే ఉంటాయని, అదే రాతి కట్టడాలు అయితే వేల సంవత్సరాలు అయినా చెక్కుచెదరవని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మన ప్రాంతంలో రుద్రదేవుడు నిర్మించిన రామప్ప దేవాలయంలా మేడారం దేవస్థానాన్ని రాతి కట్టడాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. వందల ఏళ్లయినా చెక్కుచెదరొద్దనే సంకల్పంతో నిర్మాణాన్ని చేపడుతున్నామని, కేంద్ర ప్రభుత్వం కుంభమేళాకు వేలకోట్లు నిధులు ఇచ్చిందని, ప్రఖ్యాత మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరకు ఇవ్వడం లేదని అన్నారు. జాతీయ హోదా కూడా కల్పించలేదని అన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు మేడారానికి నిధులు తెచ్చేందుకు కృషి చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు.

ఏ ముఖ్యమంత్రి కూడా చేయని అభివృద్ధి : మంత్రి సీతక్క



మేడారం మహా జాతరకు ముందు ఏ ముఖ్యమంత్రి కూడా ఇక్కడికి రాలేదని మంత్రి సీతక్క అన్నారు. వెయ్యేళ్ల సమ్మక్క-సారలమ్మల కీర్తిని చాటేలా సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కొత్త ప్రణాళికలను రూపొందించామన్నారు. దేవస్థానం ఆధునికీకరణ పనులు చేపడుతుండడంతో తన జన్మ ధన్యమైందన్నారు. అభివృద్ధి పనుల కోసం తాను అడిగిది ఆవగింజైతే తల్లులపై ఉన్న విశ్వాసంతో ముఖ్యమంత్రి కొండంత నిధులను మంజూరు చేశారని హర్షం వ్యక్తం చేశారు.

వడి వడిగా సాగిన సీఎం పర్యటన

- గద్దెల పరిసరాల్లో పూజారులతో సమీక్ష సమావేశం
- ఆదివాసీ నృత్యాలతో ఘన స్వాగతం
- వనదేవతలకు ప్రత్యేక పూజలు
- 68 కిలోల ఎత్తు బంగారం సమర్పణ

7

పోలీసుల భారీ బందోబస్తు

సీఎం రేవంత్‌రెడ్డి మేడారం పర్యటన నేపథ్యంలో ఎస్పీ శబరీశ్ నేతృత్వంలో పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తును నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వెయ్యి మందితో భద్రతను కట్టుదిట్టం చేశారు. హెలీప్యాడ్ నుంచి మొదలుకొని తల్లుల దర్శనం వరకు రోప్ పార్టీలు సీఎం వెంటే ఉన్నాయి. కార్యకర్తలు, భక్తులు, ప్రజలు రద్దీని నియంత్రిస్తూ పోలీసు సిబ్బంది శ్రమ పడాల్సి వచ్చింది.

ప్రజల హృదయాల్లో నరేష్‌రెడ్డి

- చివరివరకు ప్రజాసేవలోనే తరించిన నాయకుడు
- మాజీ ఎంపీ ఆర్.సురేందర్‌రెడ్డి, మంత్రి తుమ్మల
- పురుషోత్తమాయ గూడెంలో విగ్రహ ఆవిష్కరణ 7



నూకల నరేష్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి

పదేళ్లు జీఎస్టీ భారం మోపి ఇప్పుడు సంబురాలా?

- సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల ప్రజలపై జీఎస్టీ భారం మోపి, ఇప్పుడు సంబురాలనడం సరికాదని సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి విమర్శించారు. మహబూబాబాద్‌లో సీపీఐ పట్టణకౌన్సిల్ సమావేశాన్ని వెలుగు శ్రావణ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో జీఎస్టీ పేరిట భారం వేసి ఇప్పుడు కొన్నింటిపై కాస్తత గ్గించి సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతున్నారని ఆరోపించారు. ఈ నెల 25న సీపీఐ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, సాంబలక్ష్మి పాల్గొన్నారు.

దాడికి యత్నించిన వారిపై చర్య తీసుకోవాలి

- రోగుల ప్రాణాలు కాపాడేందుకే పని చేస్తున్నాం
- జిల్లా ఆస్పత్రి వైద్యుల వెల్లడి
- మానుకోటలో డాక్టర్ల విధుల బహిష్కరణ



జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రిలే నిరసన దీక్షలో పాల్గొన్న వైద్య బృందం

మహబూబాబాద్‌క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మానుకోటలోని జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఓ మహిళా మృతికి కారణమంటూ.. వైద్యులు, సూపరింటెండెంట్‌పై దురుసుగా వ్యవహరించి, దాడికి యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది అత్యవసర, ఓపీ సేవలు మినహా విధులను బహిష్కరించారు. నల్లబ్యాడ్జీలతో ఆస్పత్రి ఆవరణలో నిరసన దీక్ష చేపట్టారు. 'డాక్టర్లపై దాడులు ఆపుదాం.. ఆరోగ్య సమాజాన్ని కాపాడుదాం' అంటూ ప్లకార్డులను చూపుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లకావత్ వెంకట్ మాట్లాడారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మహిళా మృతి చెందిందని డాక్టర్లపై నిందవేయడం సరికాదన్నారు. రోగుల ప్రాణాలు కాపాడేందుకే వైద్యులు పనిచేస్తున్నారని, ఊపిరి తీయడానికి కాదని గుర్తు చేశారు. డాక్టర్లకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. డీఎస్పీ తిరుపతిరావు జిల్లా ఆస్పత్రికి చేరుకొని వైద్యులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వైద్యులు తిరస్కరించడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొన్నది. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంవో జగదీష్, డాక్టర్ రవీందర్, వైద్య బృందం, జూనియర్ డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడవద్దు : అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్

జిల్లా ప్రధాన ఆస్పత్రిలో జరిగిన ఘటనపై కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ప్రత్యేక చొరవతో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్‌కుమార్‌ను ఆస్పత్రికి పంపించారు.జూనియర్ డాక్టర్లు, బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరిస్థితిని సమీక్షించారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉన్నదన్నారు. ప్రజల వైద్యసేవల దృష్ట్యా ఆస్పత్రి ఎదుట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

జిల్లాలో 30.2 మి.మీ. వర్షపాతం నమోదు

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని డోర్నకల్, గార్ల, కేసముద్రం మండలాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో చిన్నపాటి జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. డోర్నకల్‌లో 73.0, గార్లలో 65.8, కేసముద్రంలో 62.4, కొత్తగూడలో 20.2, గంగారంలో 1.2, బయ్యారంలో 33.8, కురవిలో 22.6, మహబూబాబాద్‌లో 33.8, గూడూరులో 31.0, నెల్లికుదురులో 14.6, నర్సింహులపేటలో 25.2, చిన్నగూడూరులో 28.2, మరిపెడలో 42.6, దంతాలపల్లిలో 12.4, తొర్రూరులో 12.6, పెద్దవంగరలో 3.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో 482.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సగటున 30.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఆత్మగౌరవ సభకు భారీగా తరలిరావాలి

- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, కుల సంఘాల నాయకులు

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మానుకోట జిల్లా కేంద్రంలో ఈనెల 28న నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవ సభకు రాజకీయ పార్టీలకతీతంగా భారీగా తరలిరావాలని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో మంగళవారం గిరిజన సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా లంబాడ గిరిజనులు రాష్ట్ర నలుమూలల నుంచి మేధావులు, రైతులు, మహిళలు, కార్మికులు, ప్రజాప్రతినిధులు అందరూ విధిగా జాతి కోసం జరిగే పోరాటంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జేఏసీ వైస్ చైర్మన్ గుగులోతు కిషన్‌నాయక్, బోడ పృథ్వీరాజ్‌నాయక్, కర్నావత్ వెంకన్ననాయక్, గుగులోతు భీమానాయక్, దారావత్ వెంకన్ననాయక్, బోడ లక్ష్మణ్, రాజ్‌కుమార్‌జాదవ్, మంగీలాల్, హరిలాల్, శ్రీను, రాందాస్, దాము, నందులాల్, మల్సూర్, బాలాజీ పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల తుది మెరిట్ జాబితా విడుదల

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)పథకంలో భాగంగా కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించేందుకు గతంలో నిలిపివేసిన ఎంఎల్‌హెచ్‌పీ, ఎంహెచ్‌ఎన్, స్టాఫ్‌నర్స్, ఎన్సీడీ స్టాఫ్‌నర్స్ పోస్టులకు జాబితాలో ఉన్న అభ్యర్థుల తుది మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి భూక్య రవిరాథోడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాను 1:3 నిష్పత్తిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం జిల్లా సెలక్షన్ కమిటీ ఎంపిక చేసినట్లు తెలిపారు. లిస్టులో పేర్లు ఉన్న అభ్యర్థులు ఈ నెల 26న ఉదయం 10 గంటలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో వెరిఫికేషన్‌కు హాజరు కావాలన్నారు.

అసత్య ప్రచారాలను మానుకోవాలి

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



కురవిలో విలేకరులతో మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

కురవి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తాను పది బస్తాల యూరియా తీసుకుని పెద్దతండా రైతు వేదికలో మహిళ రైతులతో కలిసి క్యూలైన్‌లో నిల్చున్నానని డోర్నకల్, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు జాటోత్ రాంచందర్‌నాయక్, భూక్య మురళీనాయక్ చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర నేత సత్యవతిరాథోడ్ అన్నారు. మంగళవారం కురవిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తనను ఎమ్మెల్యేలు మహానటి సావిత్రితో పోల్చారని, మరి మీరు పెయిడ్ ఆర్టిస్టులా అని ప్రశ్నించారు. 14వ తేదీన తాను యూరియా కోసం క్యూలైన్‌లో నిలబడితే ముందే 10బస్తాల యూరియా తీసుకుని ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు క్యూలో నిలబడ్డానని ఎమ్మెల్యేలు ఆరోపించడం సత్యదూరమన్నారు. తాను క్యూలైన్‌లో నిల్చోకముందు యూరియా తీసుకోలేదని వీరభద్రస్వామిపై ప్రమాణం చేస్తానని, ముక్కు నేలకు రాస్తానని అన్నారు. వారు నిరూపించకపోతే ప్రమాణం చేస్తారా..! ముక్కు నేలకు రాస్తారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాలకు చేసిన అభివృద్ధి ఏమీలేదని, తాను గతంలో మంజూరు చేసిన పనులకే ప్రారంభోత్సవాలు చేస్తున్నారని విమర్శించారు. తొలుత కురవి శ్రీవీరభద్రస్వామి, భద్రకాళి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తోట లాలయ్య, ఐలు నరహరి, నెహ్రూనాయక్, బోడ శ్రీను, మన్యుపాట్నీ, బాదె నాగయ్య, జి.సూరయ్య, వినోద్, అర్జున్‌చౌహాన్, బానోత్ హరి, శారద పాల్గొన్నారు.

మద్యానికి బానిసై బ్లేడ్‌తో గొంతు కోసుకున్న వ్యక్తి

తొర్రూరు రూరల్, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యానికి బానిసై ఒంటరిగా ఉంటూ బ్లేడుతో గొంతు కోసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం చెర్లపాలెం గ్రామానికి చెందిన సింగారపు కొమ్మాలు భార్య జ్యోతి కాపురానికి రాకుండా పిల్లలతో దూరంగా ఉంటుంది. గత కొన్నేళ్లు ఒంటరిగా ఉంటున్న కొమ్మాలు మనస్తాపంతో బాధపడుతూ వరంగల్, తొర్రూరు పట్టణాల్లో వివిధ షాపుల్లో పని చేస్తు తిరుగుతుంటాడు. గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ గ్రామానికి వచ్చాడు. మద్యం మత్తులో మంగళవారం ఉదయం బ్లేడుతో గొంతు పై కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావం అవుతుండగా గమనించిన స్థానికులు 108, 100కు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పైలెట్ సంపత్, ఈఎంటీ వనజ, 100 సిబ్బంది సారయ్య, రాజు ప్రథమ చికిత్స చేసి తొర్రూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వెల్లికట్టెలో బతుకమ్మ లైట్లు చోరీ

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : ఎంగిలిపూల బతుకమ్మ పర్వదినం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన లైట్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పంచాయతీ కార్యదర్శి ప్రభు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు మండలం వెల్లికట్ట గ్రామంలో బతుకమ్మ వేడుకల సందర్భంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 20లైట్లను అద్దెకు తీసుకువచ్చి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షాలు వస్తుండడంతో లైట్లు తీయడానికి వెళ్లిన సిబ్బంది మూడు లైట్లు అపహరించుకు పోయినట్లు తెలిపారు. నిధులు లేకా ఇబ్బందులు పడుతున్న తాము అద్దెకు తెచ్చిన లైట్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరిం చుకు పోవడంతో ఆర్థిక భారం మీదపడే అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయం పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

అనారోగ్యంతో విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

దంతాలపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి)మండలంలోని బొడ్లాడ గ్రామానికి చెందిన నందారపు రాంచంద్రయ్య(82)మంగళవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గత కొద్ది కాలంగా ఆయన ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాంచంద్రయ్య వ్యాయామ ఉపాధ్యాయుడుగా కొడకండ్ల, తొర్రూరు, దంతాలపల్లి మండలంలో పని చేశారన్నారు. ఈక్రమంలో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందడంతో తోటి విశ్రాంత ఉపాధ్యాయులు, ఆయన పని చేసిన కాలంలో చదువుకున్న విద్యార్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

కుంటలో పడి ఒకరు గల్లంతు

- గాలింపు చర్యలు చేపడుతున్న రెస్క్యూ టీం



అశోక్

పెద్దవంగర, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంట్లకుంట గ్రామ శివారులోని చింతలకుంటలో పడి ఒకరు గల్లంతైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్ వివరాల ప్రకారం మండలంలోని అవుతాపురానికి చెందిన కమ్మగాని అశోక్(35) గ్రామంలోనే కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తూ జీవనం సాగి స్తున్నాడు. టీవీ కేబుల్ నెట్‌వర్క్ వైరు కొడకండ్ల నుంచి అవుతాపురం ఉండగా గంట్లకుంట గ్రామ శివారులో చింతలకుంట వద్ద కేబుల్ వైరు తెగిపోయింది. కేబుల్ వైరును మరమ్మత్తు చేయడం కోసం కమ్మగాని అశోక్ తెప్ప సహాయంతో చింతలకుంట లోపలికి వెళ్లి మరమ్మతు చేస్తున్న క్రమంలో తెప్ప నుంచి నీటిలో పడి మునిగి పోయినట్లు తెలిపారు. అతడితో పాటు వెళ్లిన నెల్లికుదురు మండలం బ్రహ్మణ కొత్తపల్లికి చెందిన పెరుమాండ్ల శ్రీనివాస్ బాధిత కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఎస్సై క్రాంతి కిరణ్ పరిశీలించారు. రెస్క్యూ టీమ్, ఫైర్ సిబ్బంది అశోక్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. అశోక్‌కు భార్య కమ్మగాని కనకతార ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బీజేపీతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

● ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలువడం ఖాయం ● బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు

మరిపెడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీజేపీతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటదని ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు అన్నారు. మంగళవారం ఆయన మరిపెడ విశ్రాంతి భవన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషితో భారతదేశం అగ్రరాజ్యాల సరసన చేరిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న విషయాలను ఊదహ రించారు. త్వరలో జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలువడం ఖాయమన్నారు. 2028లో తెలంగాణ రాష్ట్రం సైతం బీజేపీ ఖాతాలోకేనని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీజేపీ ఫస్ట్‌గెలిచే స్థానం డోర్నకల్‌యేనని అన్నారు. 563హైవే మరమ్మత్తు పనుల కోసం నేషనల్ హైవే అథారిటి టెండర్లను పిలిచిందని త్వరలోనే పనుల ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఆ పార్టీ రాష్ట్రనేతలు గుగులోత్ శంకర్‌నాయక్, గాదె రాంబాబు, కాంతమ్మ, కట్బోజ్ గంగాధర్, భూక్యా మంగమ్మలింగంనాయక్, బింగి రమేశ్, భూక్యా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కారోబార్‌ను విధుల్లోకి తీసుకోవద్దు



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

నర్సింహులపేట,సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) మండలంలోని నర్సింహపురం బంజరలో పనిచేసిన కారోబార్‌ను విధుల్లోకి తీసుకో వద్దని గ్రామానికి చెందిన కొంత మంది యువకులు ఎంపీడీవో ఆఫీసులో మంగళవారం వినతిపత్రం అందజేశారు. గతంలో గ్రామంలో విధులు నిర్వహించిన వెంకన్న పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి నకిలీ, బినామీ ఇన్స్యూరెన్స్ క్లెయిమ్‌లు చేయడం జరిగిందన్నారు. దీనిపై గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఎంపీడీవో సమక్షంలో గ్రామ సభ నిర్వహించి ఏకగ్రీవ తీర్మానం చేసి తొలగించడం జరిగిందని వారు తెలిపా రు. ఈ క్రమంలో మరలా తిరిగి విధుల్లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని ఎట్టి పరిస్థితుల్లో కారో బార్‌గా విధుల్లోకి తీసుకోకూడదని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారి పై ఈ నెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై జి.ఉపేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... తొర్రూరుకు చెందిన ఎస్.కె యూసుఫ్ (50) వ్యక్తిగత పనుల నిమిత్తం దంతాలపల్లికి తన ద్విచక్రవాహనం పై వెళ్లి తిరిగి వస్తుండగా తొర్రూరు మండలం ఫత్తేపురం గ్రామ శివారు చెర్లపాలెం క్రాస్ రోడ్డు వద్ద ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన అతడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య కౌస ర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ ముక్తార్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు

తొర్రూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు పట్టణంలో సీసీరోడ్లు, డ్రైనేజీలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల పట్టణంలో శాశ్వత తాగునీటి కోసం అమృత్ పైప్‌లైన్‌లు డ్రైనేజీల పక్కన వేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని 12వ వార్డు పరిధిలో, అన్నారం రోడ్డు, 1,2వ వార్డుల పరిధిలలో డ్రైనేజీలు లేక తీవ్ర ఇబ్బ ందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం పట్టణం లోని 12వ వార్డులో అమృత్ పైప్‌లైన్ సిబ్బంది ఇష్టానుసారంగా గుంతలు తీయడంతో పైప్‌లు పగిలిపోయి అటు డ్రైనేజీలు, ఇటు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వార్డు ప్రజలు పెండెం వెంకన్న, జలగం రాంమూర్తి, శ్రీనివాస్, రమేష్, ఉప్పలయ్య, కోటి, సోమయ్య తదితరులు ఆరోపిస్తున్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం: ఎర్రబెల్లి

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

తొర్రూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి మాజీ మంత్రి ఆధ్వర్యంలో పెద్దవంగర మండలం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం తొర్రూరు బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ మంత్రి దయాకర్‌రావు ఆధ్వర్యంలో భారీగా చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కష్టకాలంలో ఉన్నారని ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైనందున బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. గడప గడపకూ తిరిగి బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ బోగస్ హామీలు ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రచారం చేసి వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు గోస పడుతున్నారని యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీరాం సుధీర్, ఐలయ్య, యాకయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటా ..

తొర్రూరు రూరల్ : బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మండలంలోని ఈదులకుంటతండా, మాటేడు, కొమ్మనపల్లితండా తదితర గ్రామాల్లో అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుల కుటుంబాలను పరమార్శి ఓదార్చారు. పార్టీకోసం పని చేసిన వారు వివిధ కారణాలతో మరణించడం బాధకరమని వారి కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సీతారాములు, ప్రధానకార్యదర్శి ప్రమోద్, మాజీ ఎంపీపీ అంజయ్య, మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యుడు అంకూస్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

పూర్తయిన ఇళ్లు పంపిణీ చేయాలని ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

తొర్రూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు పట్టణంలో నిర్మాణం పూర్తయి ఉన్న రెండు పడక గదుల ఇండ్లు పంపిణీ చేయాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరుపేదలు మంగళవారం పట్టణంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహి ంచి బస్టాండ్ సెంటర్‌లో బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, ఎండీ యాకూబ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కోట్లు వెచ్చించి ఇండ్లు నిర్మించి లబ్దిదారులకు ఇవ్వకుండా వదిలేసిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, యాకయ్య, దర్గయ్య, స్వామి, వెంకటేశ్వర్లు, శోభ, వరలక్ష్మి ఉన్నారు.

దంతాలపల్లిలో ఈటల రాజేందర్ సందడి



ఈటల రాజేందర్‌తో బీజేపీ నాయకులు

దంతాలపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి)మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ సందడి చేశారు. డోర్నకల్ నియోజకవర్గంలోని పురుషోత్తయ గూ డేనికి వెళుతుండగా ఆయన మార్గమధ్యలో దంతాలపల్లికి చెందిన పలువురు బీజేపీ నాయకులతో మాట్లాడారు. అనంతరం ఇటీవల మండల కేంద్రానికి చెందిన బీజేపీ యువ మోర్చా ఉపాధ్యక్షుడు అల్లం సాయికుమార్ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

విద్యుత్ పునరుద్ధరణకు స్వచ్ఛందంగా ముందుకు..

వైర్లకు అల్లుకున్న చెట్ల తీగలు, కొమ్మలను కొట్టేసిన యువత

బయ్యారం, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): విస్తరంగా కురుస్తున్న వర్షాలతో పాటు విద్యుత్ వైర్లకు తీగలు అల్లుకొని కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుండటంతో గామస్థులు మంగళవారం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి లైన్ క్లియర్ చేశారు. బయ్యారం మండలం రామచంద్రాపురం గ్రామంలో 24 గంటలుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీంతో గ్రామానికి చెందిన పలువురు యువకులు, గ్రామస్థులు ముందుకు వచ్చి విద్యుత్ స్తంభాల ద్వారా వైర్లకు అల్లుకొని ఉన్న తీగలు, కొమ్మలను కొట్టేశారు. దీంతో విద్యుత్ సరఫరా కావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, యువకులు ముందుకు వచ్చి విద్యుత్ సరఫరా అంతరాయానికి చెక్ పెట్టేలా పనులు చేపట్టడంతో గ్రామంలో హర్షాతికేతాలు వ్యక్తమవుతున్నాయి.

మేడారం జాతర అభివృద్ధికి సీఎం, సీతక్క కృషి

● అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలు క్షమించరు

● కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య



కొత్తగూడలో మాట్లాడుతున్న వజ్జ సారయ్య

కొత్తగూడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్య దైవం శ్రీ సమ్మక్క, సారక్క, మేడారం జాతర అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య పేర్కొన్నారు. కొత్తగూడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడారం జాతర అభివృద్ధిని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. మేడారం జాతరను అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క రూ.150 కోట్లతో పనులు చేపట్టారని పేర్కొన్నారు. జాతర పనులపై సమీక్ష నిర్వహించేందుకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కపై అసత్యపు ఆరోపణలు చేస్తు అభివృద్ధిని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. జాతర అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలు క్షమించరని పేర్కొన్నారు. మేడారం జాతర అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత ములుగు మాజీ జడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతికి, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి లేదని పేర్కొన్నారు. సమావేశంలో రూరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కర్ర జనార్ధన్ రెడ్డి, డీసీసీ సభ్యుడు వీరనేని వెంకటేశ్వర రావు, మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ బొల్లు రమేష్, మండల అధికార ప్రతినిధి ఇర్ప రాజేశ్వర్, నాయకులు బోయినేని ప్రశాంత్‌రెడ్డి, నోముల ప్రశాంత్, గుమ్మడి సమ్మయ్య, వెల్దండి వేణు, కత్రోజు భిక్షపతి, ఉపేంద్రచారి, గుంటుక శ్రీను, యాదగిరి కిరణ్, కంగాల నాగేశ్వరరావు, పాఖాల స్వామి పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో అన్నదానం

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మానుకోట రైల్వేస్టేషన్‌లో బాలునాయక్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు మంగళవారం అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య బాలునాయక్ మాట్లాడారు. బాలునాయక్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద ప్రజలకు, వితంతువులకు, చిన్నారులను అక్కున చేర్చుకొని అన్నదానంతో పాటు పలు రకాల సేవా కార్యాక్రమాలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో రూపురెడ్డి నవీన్‌రెడ్డి, వలంటరీలు అనుముల సాయికిరణ్, వేణుగోపాల్, రాంబాబు నాయక్, స్వర్ణలత పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా వీరన్న



కురవి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కురవి ఆటో యూనియన్ అధ్యక్షుడిగా కాట్యాల వీరన్న రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా మాలోతు వీరన్న, ఉపాధ్యక్షుడిగా గుగులోతు రవి, కోశాధికారిగా కానిగంటి రాజు, సభ్యులుగా మంగు, వీరన్న, చిన్నా, లాలు, భద్రు, సందె వెంకన్న, చల్లా శ్రీనులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సుతో ఆటో కార్మికులు ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్నారని, కాం గ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తానన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



కొత్తగూడలో మాట్లాడుతున్న తుడుందెబ్బ, ఏఎస్పీ రాష్ట్ర నాయకులు

కొత్తగూడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు మల్లెల రాము, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దనసరి రాజేష్ డిమాండ్ చేశారు. కొత్తగూడలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. లంబాడీలు అక్రమంగా వలసలు రావడంతో అన్ని రంగాల్లో ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదనచెందారు. లంబాడీలు ఎస్టీలని ఆధారాలు ఉంటే సుప్రీంకోర్టుకు లంబాడీలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీ రిజర్వేషన్ పోరాటంలో ప్రతి ఆదివాసీ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈనెల 25న గుంజేడులో నిర్వహించతలపెట్టిన ఆదివాసీ ప్రజాసంఘాల నాయకుల సమావేశంను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు సువర్ణపాక వెంకటరత్నం, కుంజ నర్సింగరావు, పూనెం సందీప్ దొర, మల్లెల సారయ్య, ఆగబోయిన ప్రశాంత్, వజ్జ రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ



జిల్లా ఆస్పత్రిలో శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శిస్తున్న భరత్ చందర్‌రెడ్డి

బయ్యారం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన దాడిలో గాయపడి జిల్లా ఆస్పత్రిలో చిక్సిత పొందుతున్న బయ్యారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి పరామర్శించారు. ఈ నెల 21న మండల కేంద్రలోని డీసీసీబీ బ్యాంక్ సమీపంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయిని శ్రీనివాస్ రెడ్డిపై దాడికి పాల్పడి గాయపరిచిన సంగతి తెలిసిందే. దీంతో జిల్లా ఆస్పత్రిలో చిక్సిత పొందుతున్న శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా అధ్యక్షుడు పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



వన మూలికలను ప్రదర్శిస్తున్న ఆయుర్వేద వైద్యులు

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ పౌరుడు దినసరి ఆరోగ్య సూత్రాలు పాటించి, క్రమం తప్పకుండా యోగా ఆసనాలు చేస్తేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా ఆయుష్ ఇన్‌చార్జి డాక్టర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మానుకోట జిల్లా కేంద్రంలోని లయన్స్‌క్లబ్ భవనంలో మంగళవారం పదో ఆయుర్వేదిక్ దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన ఆయుర్వేదిక్ వైద్య శిబిరంలో వివిధ రకాల వన మూలికలను ప్రదర్శనలో చూపించారు. 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లీష్ మందుల కంటే ఆయుర్వేదిక్ మందులతో దీర్ఘకాలిక రోగాలతో పాటు స్వల్ప కాలిక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ప్రతీరోజు యోగా ఆసనాలు చేస్తేనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. సీజనల్‌గా తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఆచరించాల్సిన వివరాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ వీరన్న, సెక్రటరీ రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఆయుష్ డాక్టర్లు రవికుమార్, పూజిత, సూర్యం, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రావణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర ప్రకటించాలి: రైతు సంఘం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పూనెం ప్రభాకర్

గంగారం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర పెంచాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన అనంతరం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పత్తి దిగిమతిపై 11శాతం ఉన్న సుంకాన్ని రద్దు చేసిందని, దీంతో మన దేశ పత్తి రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదని, ఇప్పటికే అప్పుల పాలైన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జజ్జరి రాము, సురేందర్, సిద్దబోయిన రాము, లక్ష్మయ్య, వెంకటయ్య, పూనెం రవి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జీపీవోలు



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న గ్రామ పాలన అధికారులు

మహబూబాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను మంగళవారం గ్రామ పాలన అధికారులు (జీపీవో) మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జిల్లాలో ఇటీవల విధుల్లో చేరిన గ్రామ పాలన అధికారులు జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను కలిసి పూల మొక్కను అందించారు. గ్రామ పాలన అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.



సభా వేదికపై రిమోట్ ద్వారా అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



వడి వడిగా సాగిన సీఎం పర్యటన

గద్దెల పరిసరాల్లో పూజారులతో సమీక్ష సమావేశం

- ఆదివాసీ నృత్యాలతో ఘన స్వాగతం
- వనదేవతలకు ప్రత్యేక పూజలు
- 68 కిలోల ఎత్తు బంగారం సమర్పణ

ములుగు/తాడ్వాయి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్, ధనసరి అనసూయ, కొండ సురేఖలతో కలిసి మంగళవారం పర్యటించారు. మేడారం అభివృద్ధి పనులు, సమ్మక్క సారలమ్మల గద్దెల, ప్రాంగణ పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన మాస్టర్ ప్లాన్ రూపకల్పన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

హైదరాబాద్ నుంచి బయల్దేరిన సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 12.24 గంటలకు హెలీకాప్టర్ ద్వారా చేరుకున్నారు. మేడారం పరిసరాల్లోని హెలీప్యాడ్‌పై హెలీక్యాప్టర్ ల్యాండ్ అయ్యింది. 12:26 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి హెలీకాప్టర్ దిగారు. అక్కడి నుంచి సీఎంవో వాహనాల్లో పోలీసు కమాండ్ కంట్రోల్ రూం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు ముఖ్యమంత్రికి గౌరవ వందన చేశారు. అక్కడ నుంచి ఆదివాసి కళా నృత్యాలతో దేవస్థానం ప్రధాన ముఖద్వారం నుంచి వారికి పూజారులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. 12:38 గంటలకు సీఎం తులాభారం నిర్వహించారు. సీఎం 68 కేజీలు తూగారు. ఎత్తు బంగారం(బెల్లం), పట్టు వస్త్రాలు పూలు, పండ్లు పసుపు కుంకుమతో 12:39గంటలకు సమ్మక్క గద్దెను చేరుకున్నారు. సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల ప్రాంగణంలో దేవాదాయ అధికారులు పూజారుల చేతుల మీదుగా సీఎంకు తల్లుల పట్టు వస్త్రాలు, ప్రసాదాలు అందించారు. అనంతరం గద్దెల పరిసరాలను పరిశీలించి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకొని స్థలాలను పరిశీలించారు. అక్కడ నుంచి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూజారుల సమావేశానికి 1:01 గంటలకు హాజరయ్యారు. సమ్మక్క సారలమ్మల దేవస్థానం అభివృద్ధిపై పూజారుల అభిప్రాయాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ ఎల్‌ఈడీ స్క్రీన్‌పై దేవస్థానం ఆధునికీకరణ రూపకల్పన ప్రారంభించారు. పూర్తి డిజైన్లపై ఆర్కిటెక్ రాజశేఖర్ గంట పాటు పూజారులకు వివరించారు. పర్యటనలో భాగంగా సీఎం సమ్మక్క-సారలమ్మలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో ముందుగా ఎత్తు బంగారం తులా భారం వేశారు. ఇందులో సీఎం 68 కిలోలు తూగగా ఎత్తుబంగారాన్ని తల్లులకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కాగా, సీఎం పర్యటనలో గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి పూర్తి స్థాయిలో పూజారులను అనుమతించలేదు. దీంతో పూజారులు అవమానంగా భావించారు. మేడారం దేవస్థానం ఆధునికీకరణ డిజైన్లను సీఎం చేతుల మీదుగా ప్రారంభించే దృశ్యాలను చూడలేక పోయామని అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరికే అవకాశం ఇచ్చి, మిగిలిన వారిని బయటకు పంపించడం బాధాకరమన్నారు.



అమ్మవార్లకు బంగారం తీసుకువస్తున్న సీఎం



గ్యాలరీలో ఉన్న ప్రజలతో కరచాలనం చేస్తున్న సీఎం



ఆదివాసీ సంప్రదాయ నృత్య తలపాగాతో సీఎం రేవంత్



మేడారంలో జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం, మంత్రులు, పూజారులు



మేడారంలోని వనదేవతల గద్దెల ప్రాంగణంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

అరగంట ఆలస్యంగా ముఖ్యమంత్రి రాక

ములుగు/తాడ్వాయి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభా వేదికకు అరగంట ఆలస్యంగా చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 1.30 గంటలకు అక్కడికి రావాల్సి ఉండగా 2 గంటలకు చేరుకున్నారు. 2.05 గంటలకు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఉదయం 11 గంటలకు బహిరంగ సభకు వద్దకు చేరుకున్న ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు అప్పటి వరకు వేచి ఉన్నారు. ఈ క్రమంలో కొంత ప్రజలు ఇబ్బంది పడ్డారు. పలువురు మహిళలు వెళ్లిపోయేందుకు సిద్ధపడ్డారు. ఇది గమనించిన పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలు మహిళలను సముదాయించి కూర్చొబెట్టారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి 2.45 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

గంటల తరబడి వేచి ఉన్న భక్తులు

సీఎం పర్యటన నేపథ్యంలో భాగంగా వనదేవతల గద్దెలను భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఈ క్రమంలో గద్దెల వద్దకు ఎవరినీ అనుమతించకపోవడంతో తల్లుల దర్శనానికి వచ్చిన భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. సీఎం పర్యటన ముగిసిన అనంతరమే భక్తులను అనుమతించారు.



మేడారం గద్దెల ప్రాంగణంలో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు, ఎంపీలు



సమ్మక్క, గద్దెల నూతన నిర్మాణం నమూనా వ్యూ చిత్రం



సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ పూజారులు, నేతలు



సీఎంకు వస్త్రాలు బహూకరిస్తున్న పూజారుల సంఘం నేత జగ్గారావు



సీఎంకు ఆదివాసీ నృత్యంతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

ప్రజల హృదయాల్లో నరేష్‌రెడ్డి

- చివరివరకు ప్రజాసేవలోనే తరించిన నాయకుడు ఆయన
- మాజీ ఎంపీ ఆర్.సురేందర్‌రెడ్డి, మంత్రి తుమ్మల
- పురుషోత్తమాయ గూడెంలో విగ్రహ ఆవిష్కరణ



నరేష్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

మరిపెడ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దివంగత నేత నూకల నరేష్‌రెడ్డిని ప్రజలు ఎన్నటికీ మరవరని మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి కొనియాడారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని పురుషోత్తమాయగూడెంలోని వ్యవసాయ క్షేత్రం (ఏరువాక)లో ఏర్పాటు చేసిన నూకల నరేష్ రెడ్డి విగ్రహాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంతాప సభలో సురేందర్‌రెడ్డి మాట్లాడారు. నరేష్‌రెడ్డి నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాల్లో ఉన్నా ఎలాంటి పదవులు పొందలేదని పేర్కొన్నారు. 1989 నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ చురుకైన పాత్ర పోషించిన నరేష్‌రెడ్డి.. డోర్నకల్ నియోజకవర్గ టికెట్ ఆశించినా, కొన్ని కారణాల వల్ల వేరే వ్యక్తికి వచ్చిందన్నారు. అయినప్పటికీ ఆయన చివరివరకు ప్రజా జీవితాన్ని కొనసాగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్‌రెడ్డి భార్య రజనిరెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నూకల అభినవ్‌రెడ్డి, భవ్యరెడ్డి, జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, తెలంగాణ రెడ్డి సంఘం గౌరవ అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నరేష్‌రెడ్డి చిరస్మరణీయుడు: మంత్రి తుమ్మల

బతికినంత కాలం ప్రజల కోసమే సేవ చేసిన మంచి నాయకుడు నూకల నరేష్‌రెడ్డి అని, భౌతికంగా లేకపోయినా ఈ ప్రాంత ప్రజల గుండెల్లో ఎప్పటికీ ఆయన ఉంటారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాళి అర్పించారు. పురుషోత్తమాయగూడెంలో నరేష్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. ప్రజల బాగు కోసం ఆనాడు స్నేహ యూత్ ఏర్పాటు చేసి దేశంలోనే ఓ గుర్తింపు తెచ్చిన నేత నూకల అని కొనియాడారు.

కాగా, నూకల విగ్రహానికి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ జాటోతు రామచంద్రునాయక్, మువ్వా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, శంకర్‌నాయక్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కర్నె ప్రభాకర్, ఎనుగుల రాకేష్‌రెడ్డి, పానుగోతు రాంలాల్, గంధశిరి అంబరీష, కాలం రవీందర్‌రెడ్డి, గుండగాని సుందర్‌గౌడ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నిండా ముంచిన మొక్కజొన్న పంట

- కంకిలో గింజలు లేక రైతు నిరాశ..
- ఏపుగా పెరిగినా గింజలు రాకపోవడంతో రైతుల ఆందోళన
- అన్నారం షరీఫ్ గ్రామంలో ఘటన
- రూ. 50 వేల వరకు నష్టపోయిన రైతులు



అన్నారం షరీఫ్ గ్రామంలో మొలకెత్తని కంకిని చూపెడుతున్న రైతు

పర్వతగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ తండాలో ముగ్గురు రైతుల మొక్కజొన్న పంట ఏపుగా పెరిగినప్పటికీ, కంకిలో గింజలు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రైతు రూ. 50 వేల వరకు పెట్టుబడి పెట్టి పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటే గింజల్లో ఎదుగుదల లేకపోవడంతో మోసపోయానని గ్రహించారు. బాధిత రైతు బానోతు యాకూబ్‌తో పాటు మరో ఇద్దరి రైతుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అన్నారం షరీఫ్ శివారులో బానోతు యాకూబ్ మూడెకరాల భూమిలో మొక్కజొన్న పంటసాగు చేశాడు. బానోత్ సహదేవుడు రెండెకరాల్లో, మౌర్య పవన్‌సింగ్ కౌలు రైతుగా రెండెకరాలు సాగు చేస్తున్నారు.

ఈ మేరకు యాకూబ్ అనే రైతు ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన వారి బంధువుల సాయంతో వేంకటేశ్వర ఫర్టిలైజర్స్ షాపులో మొక్కజొన్న విత్తన ప్యాకెట్లను తెచ్చుకున్నారు. దానికి సంబంధించిన బిలుల్లను సైతం తీసుకున్నారు పంట వేసి కాపు కోసం ఎదురు చూస్తుండగా, ఎదుగుదలకు వచ్చిన కంకిలో గింజలు లేకపోవడంతో అవాక్కయ్యారు. తాము ఈ విత్తనాలను వేయడం వల్ల నష్టపోయామని ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

వనదేవతల దీవెనలతో దొరల పాలన అంతం

(5వ పేజీ తరువాయి)

సమ్మక్క సారలమ్మల దీవెనలు ఉన్నాయని, అన్నీ చక్కబడతాయని దృఢ నిశ్చయంతో వచ్చానని అన్నారు. అనుకున్న విధంగానే వాతావరణం అనుకూలించిందని ఆనందం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రేవంత్‌రెడ్డి అన్నారు. సన్నబియ్యం, రేషన్ కార్డులు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, దేవాలయాల అభివృద్ధి తదితర అనేక పథకాలు, కార్యక్రమాలను ప్రవేశపెట్టి సమర్థంగా అమలు చేస్తున్నామని తెలిపారు. దళిత, గిరిజన నాయకులకు మంత్రివర్గంలో ప్రాధాన్యత కల్పించి ఆయా ప్రాంతాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నామని అన్నారు. తనకు, మంత్రి సీతక్కకు మేడారం సమ్మక్క-సారలమ్మలు ఏలిన ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అరుదైన అవకాశం దక్కిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు సమ్మక్క-సారలమ్మల దేవాలయాన్ని పునర్నిర్మించే అవకాశం దక్కడం అదృష్టమన్నారు.

ఎన్ని కోట్లయినా ఖర్చు పెడతాం

మేడారం ఆలయ అభివృద్ధికి ఎన్ని కోట్లయినా ఖర్చుపెడతామని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా మేడారం అభివృద్ధి కోసం నిధుల కొరత రానివ్వమన్నారు. అభివృద్ధి పనుల్లో ఆదివాసీలను భాగస్వాములను చేస్తామని తెలిపారు. రీసెర్చ్ స్కాలర్‌లను కలుపుకొని పని చేస్తామని అన్నారు. ఈ పనులు 100 రోజుల్లో పూర్తిచేసేందుకు సంకల్పం పెట్టుకున్నామని, పనులు వేగవంతం కావడానికి ఈ ప్రాంత ప్రజలు సహకారాన్ని అందించాలని కోరారు. అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టేందుకు 2వేల మంది వర్కర్లతో రాత్రింబవళ్లు పనులు జరిపించాలన్నారు. ఆ పనులను ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నెలలో నాలుగుసార్లు ఇక్కడికి వచ్చి పరిశీలించాలన్నారు. సమ్మక్క'సారలమ్మల దేవాలయంతో పాటు జంపన్నవాగు, రహదారుల నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. అయ్యప్పమాల వేస్తే ఏ విధంగా దీక్షతో ఉంటారో.. మేడారం దేవాలయం పనులు పూర్తిచేసేందుకు కూడా అంతే చిత్తశుద్ధితో ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీలు బలరాంనాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, తెల్లం వెంకటరావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, దేవాదాయ శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు స్కీంలను ప్రైవేట్ ఇన్సూరెన్స్‌లకు ఇవ్వొద్దు

● భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నేత రాములు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు స్కీంలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించవద్దని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి, అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వంగూరు రాములు కోరారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం సీఐటీయూ అనబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబరు 12ను సవరించి కార్మికుల వెల్ఫేర్‌బోర్డు నుంచే సంక్షేమ పథకాలు అందించాలని, అక్రమంగా ప్రైవేట్ బీమా కంపెనీలకు ఇచ్చిన రూ.346 కోట్లు తిరిగి బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో సెస్ ద్వారా వసూలైన సుమారు రూ.6 వేల కోట్ల నిధులను ప్రైవేట్ ఇన్సూరెన్స్‌ల కంపెనీలకు ఇవ్వడం కోసం జీవో నెంబరు 12ను విడుదల చేశారని చెప్పారు. జీవో విడుదల చేసిన రెండు రోజులకే రూ.346 కోట్ల నిధులను అక్రమంగా బదిలీ చేశారని, దానిని విరమించుకుని వాటిని బోర్డుకు జమ చేయాలని కోరారు. ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వడం వల్ల కార్మికులు నష్టపోతున్నారని, రాష్ట్రప్రభుత్వం దానిని విరమించయకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, భవన నిర్మాణసంఘం బాధ్యులు గారె కోటేశ్వరరావు, కొండా ఉప్పలయ్య, బానోత్ శంకర్, వెంకన్న, విష్ణు, ఎమ్డీ. ఉస్మాన్, ఎస్కే. మౌలానా, అంకుస్, వెంకటేష్, భిక్షం, యాకయ్య, బిచ్యా, సర్వర్, యూసూఫ్, మోతీలాల్ పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న వంగూరు రాములు

హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆల్ హమాలీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో మంగళవారం సీఐటీయూ అనుబంధ ఆల్‌హమాలీ యూనియన్ జిల్లా మహాసభను నిర్వహించారు. సీనియర్ సభ్యుడు అంబటి వీరస్వామి సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికుల శ్రమను పాలకులు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు.

ఆల్ హమాలీ యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక

ఆల్ హమాలీ యూనియన్ జిల్లా మహాసభలో 25 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కుంట ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి కుంట్ల నాగన్న, కోశాధికారిగా ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా అంబటి వీరస్వామి, బత్తుల వెంకన్న, వెన్నుమోహన్, అల్లం రాములు, సహాయ కార్యదర్శులుగా పతంగి పురుషోత్తం, మల్లయ్య, జంపయ్య, వెంకన్న, రవి ఎన్నికయ్యారు. ఈ మహాసభలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, వల్లాల వెంకన్న, జయరాజు, బాబు, సోమిరెడ్డి, క్రాంతి, బాలు, యాకన్న, సత్యం, సురేష్, మల్లయ్య, సంపత్ పాల్గొన్నారు.


కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనలో మాట్లాడుతున్న పాయం చిన్నచంద్రన్న

పత్తికి మద్దతు ధర రూ.10,075 ప్రకటించాలి

●అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నచంద్రన్న

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం పత్తికి మద్దతు ధర క్వింటాకు రూ. 10,075 ప్రకటించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాయం చిన్నచంద్రన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రన్న మాట్లాడుతూ కేంద్రం అమెరికా, ఇంగ్లండ్ దేశాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల పత్తి దిగుమతిపై 11 శాతం సుంకాన్ని రద్దు చేశారని చెప్పారు. దీంతో పత్తి రైతులు తీవ్రంగా నష్ట పోయే ప్రమాదముందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వరదల వల్ల నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మలకు వినతి పత్రాన్ని అందించారు. ఈకార్యక్రమంలో పూనెం ప్రభాకర్, ఆవుల కట్టయ్య, ఉమ్మగాని సత్యం, ముంజంపల్లి వీరన్న, పాపయ్య, రాములు, వెంకన్న, వీరస్వామి, నాగేశ్వర్‌రావు, నారాయణ పాల్గొన్నారు.

'పండుగ సెలవులు ఇవ్వాలి'

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు పాఠశాలల తరహాలో బతుకమ్మ, దసరా పండుగ సెలవులు ఇవ్వాలని ఏఐటీయూసీ అనుబంధ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిర్ర లక్ష్మీనర్సమ్మ, ఎల్లారీశ్వరి విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లో మంగళవారం నిర్వహించిన సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని, పీఎఫ్. ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.

సాహితీ కిరీటి పురస్కారానికి సత్యనారాయణ ఎంపిక



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణ కేంద్రానికి మానుకోట జిల్లా తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు, చెందిన కవి, రచయిత సత్యనారాయణ ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో ఈనెల 28న జరగనున్న పురస్కార ప్రదానోత్సవంలో సత్యనారాయణ సాహితీ కిరిటీ పురస్కారం అందుకోనున్నారు. తెలుగు భాష, తెలుగు సంస్కృతి, తెలుగు వైభవం, తెలుగు సాహిత్యం, తెలుగు కళల పరిరక్షణ కోసం కృషి చేసిన వారికి అందించే సాహితీ కిరిటీ పురస్కారం అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీశ్రీ కళావేదిక సీఈవోకత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా సత్యనారాయణ అందుకోనున్నారు.

సీసీ రోడ్డును నిర్మించాలి




రైల్వే క్యాబిన్ రోడ్డుపై ఆందోళన చేస్తున్న పీవైఎల్ సభ్యులు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే క్యాబిన్‌రోడ్డు వర్షం వస్తే బురదమయంగా మారి పాదచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెంటనే సీసీ రోడ్డు వేయాలని ప్రగతిశీల యువజ సంఘం (పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు సామ పాపయ్య డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో బురదమయమైన రోడ్డుపై పీవైఎల్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ క్యాబిన్ రోడ్డు గుంతలమయంగా మారి అందులో వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారి అందులో నుంచి వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దారి వెంట అనేక కాలనీల ప్రజలు వెళ్తారని సీసీ రోడ్డు వేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గువ్వ శ్రీను, రమేష్, రవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆధ్వర్యంలో పోషణ్ మాసం

నెల్లికుదురు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లికుదురు అంగన్‌వాడీ సెక్టార్ ఆధ్వర్యంలో మంగళవారం పోషణ్ మాసం కార్యక్రమం నిర్వహించారు. బతుకమ్మలు పేర్చి అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు పాటు నృత్యాలు చేశారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో విజయలక్ష్మీ సుపర్‌వైజర్ నాగమణి అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

విద్యుత్ ఎస్ఈని కలిసిన.. అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ బాధ్యులు


విద్యుత్ శాఖ అధికారి విజయేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ బాధ్యులు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణంలో జిల్లా విద్యుత్‌శాఖ అధికారి విజయేందర్‌రెడ్డిని మంగళవారం అసిస్టెంట్స్ ఇంజనీర్స్ అసోసియేషన్ బాధ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగ ఎన్పీడీసీఎల్ , ట్రాన్స్‌కో కంపెనీ సెక్రటరీ దిలీప్, జాయింట్ సెక్రటరీ నవీన్ మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పని చేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ల సమస్యలను ఎస్ఈ విజయేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. సానుకూలంగా స్పందించిన ఎస్ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిఖిల్, అరుణ్, తరుణ్, సుమన్ పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం : ప్రభుత్వ విప్


బ్లడ్ డోనేషన్ సర్టిఫికెట్ అందచేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం మరొకరికి ప్రాణదానమని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మంగళవారం మరిపెడ పీహెచ్‌సీలో స్వస్త నారీ-స్వశక్తి పరివార్ అభియాన్ పథకంలో భాగంగా జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించగా రాంచంద్రునాయక్ దానిని ప్రారంభించి మాట్లాడా రు. యువత రక్తదానం చేసే ఇతరులను ఆదుకోవాలని సూచించారు. ఈ రక్తదాన సందర్భంగా 20 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగిందని డీఎంహెచ్‌వో డాక్టర్ రవిరాథోడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్‌రెడ్డి, డాక్టర్ హితేశ్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ నేత వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, విసారపు శ్రీపాల్‌రెడ్డి, మరిపెడ పట్టణ అధ్యక్షుడు తాజ్‌ద్దీన్, వెంకటేశ్వర్లు, నోడల్ ఆఫీసర్ సక్కుబాయి, సూపర్‌వైజర్లు మంగమ్మ, కృష్ణ, ఆచార్యులు, సుదర్శన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మరిపెడ మండల్ పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు రాంచంద్రునాయక్ ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆలేరు విద్యార్థుల ఎంపిక

నెల్లికుదురు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కురవిలో నిర్వహించిన సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలలో మండలంలోనిఆలేరు విద్యార్థులు బానోత్ సాయి చరణ్, ఎండీ సమీర్, ఎల్.నవదీప్‌లు రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలకు ఎంపికైయ్యారు. ఈనెల 25నుంచి 28 వరకు కబడ్డీ అసోసియేషన్ నిజామాబాద్ జిలాల్లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొననున్నట్లు కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ సంద వీరన్న తెలిపారు.

ఆయుష్ వైద్యులకు ఘన సన్మానం

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయుష్ డాక్టర్లను ఘనంగా సన్మానించారు. స్థానిక లయన్స్ భవనంలో ఆయుష్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ పి.కిరణ్ కుమార్, డాక్టర్లు రవికుమార్, పూజిత, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రవణ్‌కుమార్‌ను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ మానుకోట శాఖ అధ్యక్షుడు డాక్టర్ బి.వీరన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కోశాధికారి కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, అనుమాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


గౌతమి జూనియర్ కళాశాల మైదానంలో బతుకమ్మ వేడుకలో పాల్గొన్న కళాశాల డైరెక్టర్ తక్కెళ్లపల్లి సంధ్యారాణి

తెలంగాణలో ఆడపడుచుల సంబురాల పండుగ బతుకమ్మ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ఆడపడుచుల సంబురాల అతిపెద్ద పండుగ బతుకమ్మ అని గౌతమి జూనియర్ కళాశాల డైరెక్టర్ తక్కెళ్లపల్లి సంధ్యారాణి అన్నారు. మహబూబాబాద్‌లోని స్థానిక కళాశాలలో మంగళవారం మూడో రోజు బతుకమ్మలను పేర్చి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ...తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఒక చోట ఉంచి ఆటా...పాటలతో కోలాటాలు వేస్తూ తొమ్మిది రోజులు ఆనందంగా గడిపే అతి పెద్ద పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. కళాశాలలో ప్రతి సంవత్సరం విద్యార్థినులతో బతుకమ్మలను పేర్చి భవిష్యత్ తరాలకు పండుగ విశిష్టతను తెలియజేసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ్‌కుమార్, అధ్యాపకులు రవి, భాస్కర్, శ్రీరామ్, రఘు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వసతి గృహాలు ఏర్పాటు చేయాలి

గూడూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుసంధానంగా విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా వసతి గృహాలు ఏర్పాటు చేయాలని భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (డీఎస్ఎఫ్ఐ) జాతీయ అధ్యక్షులు వివేక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో బాలురు, బాలికలకు కళాశాల వసతి గృహాలను ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహాలు లేకపోవడం వల్ల విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటూ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కళాశాలలో 500 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసించేవారని, ప్రస్తుతం ఆ సంఖ్య 130కి తగ్గిందన్నారు. కళాశాలలో మౌళిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తన సొంత ఖర్చులతో కళాశాలకు వెళ్లే దారికి మరమ్మతులు చేయిస్తానని చెప్పారు.

డీఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి మాలోతు శాంతికుమార్, రాష్ట్ర అధ్యక్షుడు వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి కేలోతు సాయికుమార్, కోశాధికారి సూర్యప్రకాష్, నాయకులు శివవర్మ, శ్రీకాంత్, దిలీప్, రమేష్, యుగంధర్, దేవేందర్ పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన ఉండాలి

● సెర్ప్ ఏపీడీ శ్రీనివాస్

కేసముద్రం, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయ సంఘాల్లోని మహిళలు నగదు రహిత లావాదేవీల్లో భాగంగా డిజిటల్ చెల్లింపులపై అవగాహన పొందాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం (సెర్ప్) జిల్లా ఏపీడీ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ఉప్పరపల్లి రైతువేదికలో మంగళవారం మదర్‌థెరిస్సా గ్రామైక్య సంఘం పరిధిలోని స్వయం సహాయ సంఘాల మహిళలకు నగదు రహిత లావాదేవీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ప్రతీ సభ్యురాలు తమ మొబైల్‌లో యూపీఐ ద్వారా చెల్లింపులు చేయాలని, దీనివల్ల ప్రతీ లావాదేవీ డిజిటల్‌గా నమోదవుతూ పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. డిజిటల్ చెల్లింపులతో ప్రతీ లావాదేవీ మన మొబైల్‌లో రికార్డు కావడంవల్ల తర్వాత ఎప్పుడైనా తనిఖీ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఆధునిక పరిజ్ఞానంలో పట్టు సాధించాలని, కష్టపడి నేర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కృష్ణమూర్తి, సీసీ నళిని, వీవో అధ్యక్షురాలు శాంత, వీవోఏలు వచ్చాల సాంబయ్య, శాగంటి శ్రీనివాస్, సీఆర్పీలు కోమల, రేణుక, సుజాత పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



ర్యాలీలో పాల్గొన్న డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వివేక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేష్‌రెడ్డి

● డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వివేక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిరుద్యోగుల జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేయాలని డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వివేక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో మంగళవారం డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగుల జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలనే డిమాండ్‌తో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న వారు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉపాధిలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చినహామీలను అమలుచేయాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు నిరుద్యోగభృతి ఇస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులకు మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో గుగులోతు ప్రవీణ్, శాంతికుమార్, వీరభద్రం, సూర్యప్రకాష్, పురుషోత్తంయాదవ్, శివవర్మ, దిలీప్, యుగంధర్, రమేష్, కిరణ్, ప్రణయ్, ప్రీకాంత్ పాల్గొన్నారు.


దుర్గామాత అమ్మవారికి పూజలు చేస్తున్న స్వర్ణకార సంఘం బాధ్యులు

గాయత్రీదేవి అలంకరణలో దుర్గామాత అమ్మవారు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాల వద్ద నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో స్వర్ణకార సంఘం, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారు ఈ నెల 22న తొలిరోజు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా పూజలందుకున్న అమ్మవారు రెండో రోజు మంగళవారం గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పమ్మి సనాతనాచారి, యిమ్మడి రవికుమార్, చౌడవరపు మోహన్‌రావు పాల్గొన్నారు.

'మాదకద్రవ్య రహిత సమాజానికి పాటుపడాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్య రహిత సమాజానికి పాటుపడాలని ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ ఆధ్వర్యంలో మునిసిపల్ పరిధిలోని జమాండ్లపల్లిలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే మంగళవారం డ్రగ్స్ నియంత్రణపై భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ అధ్వర్యంలో నాలుగవ రోజుడ్రగ్స్ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, విద్యప్రాముఖ్యత మొదలగు అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కళాశాల సిబ్బంది బుడమ రవి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.


డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ సదానందం, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు

మెసెంజర్ల సమస్యలు పరిష్కరించాలి

● ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డికి వినతి



ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మెసెంజర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మండల విద్యావనరుల కేంద్రాల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మెసెంజర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిక్షపతి, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. హన్మకొండ పీఆర్టీయూ కార్యాలయంలో మంగళవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 60 ప్రకారం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పెంచిన వేతనాలను విద్యాశాఖ మండల విద్యావనరుల కేంద్రాల్లో పనిచేస్తున్న మెసెంజర్లకు కూడా వర్తింపచేసే విధంగా చూసి న్యాయం చేయాలని కోరారు.

జీఎస్టీ తగ్గింపు పేదలకు వరం : బీజేపీ

జనగామ రూరల్, సెప్టెబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో పేదలకు వరంలాంటిదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నా రు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించి, అనంతరం విలేకరులసమావేశంలో మాట్లాడారు. పీఎం మోదీ నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, రైతులకు సంబంధించిన వస్తువులు, వాహనాలపై జీఎస్టీ తగ్గించి పేదలపై భారాన్ని తగ్గించిందన్నారు. ఈ కార్యక్రమంలో శశిధర్‌రెడ్డి, కొంతం శ్రీనివాస్, ఐలోని అంజిరెడ్డి, భాగాల నవీన్‌రెడ్డి, తోకల ఉమారాణి, దేవర ఎల్లయ్య, బొమ్మకంటి అనిల్ గౌడ్, శానబోయిన మహిపాల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.